నమస్తే తెలంగాణ

సూర్యాపేట

5 | నల్లగొండ, ఆదివారం 22 డిసెంబర్ 2024 | SURYAPET


## మున్సిపల్ ఆఫీసు ముందు చెత్తపోసి నిరసన

- లోపించిన పారిశుధ్యంపై మండిపాటు

భూదాన్‌పోచంపల్లి, డిసెంబర్ 21 : పారిశుధ్య నిర్వహణ లేక భూదాన్‌పోచంపల్లి మున్సిపల్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 13 వార్డులో చెత్తను సేకరించే బండి రాకపోవడంతో విసుగెత్తిన వార్డు ప్రజలు శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట చెత్తను పోసి నిరసన తెలిపారు. వారానికి ఒకసారి చెత్తను సేకరిస్తున్నారని, చెత్త పోగు అవడంతో దోమల బెడద విపరీతంగా ఉంటున్నదని వాపోయారు. అధికారులు స్పందించి ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో చింతకింది కిరణ్, వనం సతీశ్, సామల విజయ్, క్రాంతికుమార్ పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట చెత్త పోసి నిరసన తెలుపుతున్న 13వార్డు ప్రజలు

**వ్యవసాయ స్థిరీకరణలో** భాగంగా రైతు బంధు పెట్టాం. 24గంటల నాణ్యమైన నిరంతరం ఉచిత విద్యుత్ ఇచ్చాం. ప్రతి నీటి బొట్టునూ ఒడిసిపట్టి నీళ్లు ఇవ్వాలన్న ఎజెండాతో పని చేశాం. అందుకే కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నల్లగొండ జిల్లా ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిచింది. పదేండ్లలో రైతుబంధు మాత్రమే కాదూ.. సకాలంలో ఎరువులు, విత్తనాలు, రైతు వేదికలు సమకూర్చాం. వ్యవసాయ స్థిరీకరణ జరుగాలన్న లక్ష్యంతో పని చేశాం. వ్యవసాయ మోటార్లకు మీటర్ల పెట్టకుండా 30 వేల కోట్లను వదులుకున్నాం. ఇది మా కేసీఆర్ కమిట్‌మెంట్.



*- మాజీ మంత్రి కేటీఆర్*

**లాస్ట్ పదేండ్లలో** నల్లగొండ జిల్లాలో ఒక్క ఎకరాకైనా కొత్తగా ఇరిగేషన్ వాటర్ వచ్చిందా? నల్లగొండ జిల్లాలో ఎక్కువ ధాన్యం పండిందంటే అది ఆనాటి సాగర్ డ్యామ్, ఏఎమ్మార్పీతో వచ్చిన పంటే. కేసీఆర్ ప్రభుత్వం కొత్తగా ఒక్క ఎకరాకూ నీళ్లు ఇవ్వలేదు. నల్లగొండ జిల్లాలో కొత్తగా ఒక్క ఎకరా ఆయకట్టుకు పదేండ్లలో నీళ్లు ఇచ్చినట్లు రుజువు చేస్తే... అందరం కలిసి వెళ్దాం.. రాజీనామా చేసి... రాజకీయాలు బంద్ చేసుకుంటా.



*-మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి*

**వెంకట్‌రెడ్డి గారూ...** నల్లగొండ జిల్లాకు అన్యాయం అయ్యిందన్నారు.. సభ అయ్యాక మనం ఇద్దరం సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ ప్రాంతాలకు పోదాం. 2 లక్షల ఎకరాలకు నీళ్లు వచ్చాయా.. లేదా.. కాల్వల మీద నడుస్తూ రైతులను అడుగుదాం. నీళ్లే కాదూ.. నల్లగొండకు ఎన్నో ఇచ్చాం. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు మూడు మెడికల్ కాలేజీలు ఇచ్చాం. యాదాద్రి పవర్ ప్లాంట్ ఇచ్చాం. నల్లగొండ పట్టణాన్ని కేసీఆర్ హయాంలో ఎలా తీర్చిదిద్దామో అక్కడి ప్రజలే చెప్తారు.



*- మాజీ మంత్రి హరీశ్‌రావు*

# కాంగ్రెస్ కాలంలో కరువే నిండా..

# కేసీఆర్ హయాంలో ధాన్యపు కొండ

## పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ధాన్యాగారంగా నల్లగొండ జిల్లా

- కరువు నేల నుంచి సిరుల మాగాణానికి ప్రస్థానం
- వలసల జిల్లా నుంచి ఇక్కడికే వలసలు వచ్చే స్థాయికి
- 4.44లక్షల ఎకరాల నుంచి 13.54లక్షల ఎకరాలకు పెరిగిన వరి సాగు
- 2023 యాసంగిలో 33.85లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి
- అసెంబ్లీ వేదికగా మంత్రి కోమటిరెడ్డి పచ్చి అబద్ధాలు
- పదేండ్లలో నల్లగొండలో కొత్తగా ఒక్క ఎకరాకూ నీళ్లు ఇవ్వలేదన్న వెంకట్‌రెడ్డి
- క్షేత్రస్థాయికి వెళ్దాం.. వస్తావా! అంటూ సవాల్ చేసిన కేటీఆర్, హరీశ్‌రావు

*ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నేటికీ ప్రతీ ఎకరాకూ అందుతున్న సాగు నీరు కాంగ్రెస్ ప్రభుత్వ చలువేనట! కేసీఆర్ హయాంలో ఒక్క ఎకరాకూ కొత్తగా నీళ్లు పారలేదు అట!! నీళ్లు పారినట్లు రుజువు చేస్తే తన పదవికి రాజీనామా చేసి... రాజకీయాలు బంద్ చేసుకుంటానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా అసత్యాలు మాట్లాడడంపై నల్లగొండ జిల్లా రైతులు ముక్కున వేలు వేసుకుంటున్నారు. ప్రభుత్వ లెక్కలు... వివిధ శాఖల గణాంకాలు... కేంద్ర ప్రభుత్వ సంస్థలు ప్రకటించిన వివరాల ప్రకారం కూడా కేసీఆర్ పాలనలో వ్యవసాయ రంగంలో నల్లగొండ జిల్లా సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. మంత్రి కోమటిరెడ్డి అసత్యాల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో 2014కు ముందు కాంగ్రెస్ పాలనలోని పరిస్థితిని... గత పదేండ్లల్లో కేసీఆర్ హయాంలో జరిగిన విప్లవాత్మక మార్పులను తేటతెల్లం చేసే కథనమిది.*

*- నల్లగొండ ప్రతినిధి, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ)*



భువనగిరి అర్బన్ : భువనగిరి మండలం మన్నేవారిపంపు గ్రామ శివారులో కాళేశ్వరం జలాలతో పండిన పంటను కోస్తున్న వరి కోత మిషన్ (ఫైల్)

సమైక్య రాష్ట్రంలో ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ పాలనలో నాటి ఉమ్మడి నల్లగొండ జిల్లా కరువు ఖిల్లాగా ముద్రపడింది. అన్ని అవకాశాలు ఉన్నా పాలకుల నిర్లక్ష్యంతో సాగునీరు లేక పంటలు పండక, భూములు పడావు పడి వలసల జిల్లాగా ఉంది. నాగార్జునసాగర్ ఆయకట్టు మినహాయిస్తే అంతా సాగునీటికి బోరుబావులే ఆధారం. పాతాళంలోని భూగర్భజలాలకు తోడు వచ్చీరాని కరెంటుతో మొదటి మడి తడవడమే కష్టమయ్యేది. ఇలా రైతన్న గోస చెప్పనలవిగా ఉండేది. రైతులు భూములు వదిలి పట్నం వలస బాట పట్టగా లక్షలాది ఎకరాలకు బీళ్లుగా మిగిలాయి. కానీ కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఆ నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో నల్లగొండ రైతన్న సగర్వంగా తలెత్తుకుని దేశానికే ఆదర్శంగా నిలిచాడు. బీఆర్ఎస్ పాలనలో ఉమ్మడి నల్లగొండ జిల్లా రూపురేఖలే మారిపోయాయి. ఏడాదికేడాదికి వ్యవసాయంలో గణనీయమైన ప్రగతిని సాధించింది. రాష్ట్రం సాధించిన తొలి ఏడాదే నాగార్జునసాగర్ ఆయకట్టుకు కృష్ణా జలాల్లో నిక్కచ్చిగా నీటి వాటా అందిస్తూ రెండు పంటలకు సాగునీరు అందించారు. కృష్ణా జలాలకు కొద్దికాలంలోనే కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు తోడయ్యాయి. మిషన్ కాకతీయతో చిన్న నీటి వనరులను పటిష్టపర్చడంతో భూగర్భజలాలు సమృద్ధిగా అందుబాటులోకి వచ్చాయి. వీటన్నింటికి తోడు 2018 నుంచి వ్యవసాయానికి 24 గంటల కరెంటు సరఫరా అతిపెద్ద మార్పునకు బాటలు వేసింది. సాగు బడిలో రైతన్నకు ధైర్యమిస్తూ రైతుబంధు తోడైంది. ఇవన్నీ వెరసి నల్లగొండ రైతుల స్థితిగతులనే మార్చేశాయి. ముఖ్యంగా వరి సాగులో నల్లగొండ రైతులు దేశం దృష్టిని ఆకర్షించే స్థాయికి చేరారు. దేశంలోనే అతి ఎక్కువ వరి పండిస్తున్న జిల్లాగా నల్లగొండ అగ్రగామిగా నిలిచింది. 13.54లక్షల ఎకరాలకు వరి సాగు విస్తీర్ణం పెరిగితే 34 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించి రాష్ట్రానికే తలమానికంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా నిలిచింది.

### 4.44లక్షల నుంచి 13.54లక్షల ఎకరాలకు...

పదేండ్ల కేసీఆర్ హయాంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా వరి సాగు అమాంతం 305 శాతం పెరిగితే... సాగైన ప్రతి గుంటకూ సాగునీరు అందడం విశేషం. 2014 నుంచి 2023 వరకు వరి సాగు విస్తీర్ణాన్ని పరిశీలిస్తే... కేసీఆర్ హయాంలోని తొమ్మిదిన్నరేండ్లల్లో అదనంగా 9.10లక్షల ఎకరాల్లో వరి సాగైనట్లు వ్యవసాయ శాఖ లెక్కలు స్పష్టం చేశాయి. సమైక్య రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన చివరి నాటికి 2014 వానకాలం సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో వరి సాగు కేవలం 4.44లక్షల ఎకరాల్లోనే ఉండేది. అలాంటిది కేసీఆర్ హయాంలో యేటా సాగు విస్తీర్ణం పెరుగుతూ... 2023 వానకాలంలో ఉమ్మడి జిల్లాలో సాగు విస్తీర్ణం 13.54లక్షల ఎకరాలకు విస్తరించింది. వరి సాగులో రాష్ట్రంలోనే నల్లగొండ అగ్రస్థానంలో నిలిచింది. జిల్లా నలువైపులా సాగు నీటి వనరులు విస్తృతంగా అందుబాటులోకి రావడంతోనే ఈ ఘనత సాధ్యమైంది. స్వరాష్ట్రంలో అప్పటి సీఎం కేసీఆర్ నాయకత్వంలో నాగార్జున సాగర్ ఎడమ కాల్వ ఆయకట్టుతో పాటు ఏఎమ్మార్పీ లో లెవల్, హై లెవల్ కాల్వల ద్వారా సమృద్ధిగా కృష్ణా జలాలు అందుబాటులోకి వచ్చాయి. మూసీ ద్వారా అదనపు జలాలు, చెరువులు, కుంటల ద్వారా భూగర్భజలాలు అందాయి. సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడలోని ఎడమ కాల్వ ఎగువ భాగం, ఆలేరు, భువనగిరిలోని మెజార్టీ ప్రాంతాలకు కాళేశ్వరం ద్వారా గోదావరి జలాలు కేసీఆర్ హయాంలో అందుబాటులోకి వచ్చాయి. వీటన్నింటి ఫలితంగా ఉమ్మడి జిల్లా దేశంలోనే అగ్రగామిగా రూపుదిద్దుకుంది.

### సాగు విస్తీర్ణం రెట్టింపు

ఉమ్మడి జిల్లాలో ఈ పదేండ్ల కాలంలో సాగు నీటి వనరులు ఊహకందని రీతిలో పెరగడంతోపాటు ప్రభుత్వం వైపు నుంచి అన్ని రకాలుగా ప్రోత్సాహం లభిస్తుండడంతో పంటల సాగు విస్తీర్ణం ఊహించని రీతిలో పెరిగింది. పదేండ్లల్లో అన్ని పంటల సాగు రెట్టింపైంది. ఉమ్మడి జిల్లాలో 35.10 లక్షల ఎకరాల భూమి అందుబాటులో ఉంది. ఇందులో 2014 నాటికి అప్పటి కాంగ్రెస్ పాలనలో అన్ని పంటలు కలిపి మొత్తం సాగు విస్తీర్ణం 13.12 లక్షల ఎకరాలకే పరిమితమైంది. 2023 చివరకు వచ్చే సరికి అది రెట్టింపును దాటి 26.50లక్షల ఎకరాలకు చేరుకుంది. ప్రధానంగా వరి సాగు విస్తర్ణమే 9.10లక్షల ఎకరాల్లో పెరిగింది. మిగతా అన్ని పంటలు కలిపి మరో నాలుగు లక్షల ఎకరాలకు సాగు విస్తీర్ణం పెరిగింది. అంటే 60 ఏండ్ల సమైక్య పాలనలో 13.12లక్షల ఎకరాలే సాగులోకి వస్తే... కేవలం కేసీఆర్ పదేండ్ల కాలంలో 13.38లక్షల ఎకరాలు కొత్తగా సాగులోకి వచ్చినట్లు స్పష్టమవుతున్నది.

స్వరాష్ట్రంలో నాటి సీఎం కేసీఆర్ సంపూర్ణ తోడ్పాటుతో సమైక్య పాలనలో సాగును వదిలి వెళ్లిన వారంతా తిరిగి సాగుపై దృష్టి సారించారు. దాంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వ్యవసాయం పండుగలా మారింది. కేసీఆర్ హయాంలో ఏటికేడు పంటల సాగు, దిగుబడులు, రైతుల ఆదాయం పెరుగుతూ వచ్చింది. అందుకే దేశంలోనే ధాన్యం ఉత్పత్తిలో నల్లగొండ జిల్లా అగ్రస్థానానికి ఎదిగింది. వాటన్నింటినీ కాదంటూ కేవలం ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ పెద్దలు, మంత్రులు అసత్య ప్రచారానికి తెరలేపారు. అసలు నల్లగొండకు కొత్తగా నీళ్లే ఇవ్వలేదని బుకాయిస్తున్నారు. నీళ్లు ఇవ్వకపోతే కేవలం నీళ్లపై ఆధారపడి పండే వరి సాగు ఏకంగా 9.10లక్షలకు ఎలా పెరిగిందో చెప్పాల్సిన అవసరం ఉంది. శనివారం అసెంబ్లీలో మాజీ మంత్రులు, ప్రస్తుత ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు చేసిన సవాల్‌కు సిద్ధపడి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సూర్యాపేట జిల్లా భూములను సందర్శించగలరా? అనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

### ధాన్యం ఉత్పత్తిలో టాప్

ఉత్పత్తి విషయానికి వస్తే.. 2014 వానకాలంలో 12.11లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అంచనాకు గానూ వచ్చీరానీ కరెంటుకుతోడు భూగర్భజలాలు సరిగ్గా లేక 7.20లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యమే రైతుల చేతికి వచ్చింది. ఇందులో స్థానిక అవసరాలకు పోనూ కేవలం 61వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేసింది. కానీ 2023 యాసంగి కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లాలో 13.54లక్షల ఎకరాల్లో వరి సాగవగా ఒక్క గుంట కూడా పంట ఎండకుండా పంట చేతికొచ్చింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 33.85లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రాగా స్థానిక అవసరాలు పోనూ 12.11లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేయడం విశేషం. అందుకు గానూ రైతులకు అందిన మద్దతు ధర రూ.2,255 కోట్లు నేరుగా అన్నదాతల ఖాతాల్లో జమైంది.



దామరచర్ల మండలం వాడపల్లి చెక్‌పోస్టు వద్ద రికార్డులను పరిశీలిస్తున్న ఐజీ సత్యనారాయణ, నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్, డీఎస్పీ రాజశేఖర్‌రాజు

## శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట నిఘా

- హైదరాబాద్ రేంజ్ ఐజీ వి.సత్యనారాయణ

మిర్యాలగూడ, డిసెంబర్ 21: శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట నిఘా ఏర్పాటు చేశామని హైదరాబాద్ రేంజ్ ఐజీ వి.సత్యనారాయణ అన్నారు. మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడేండ్లుగా నేరాలు పెరుగుతున్నాయని అదుపు కోసం పటిష్ట పెట్రోలింగ్ నిర్వహించాలని అధికారులకు సూచించారు. మిర్యాలగూడ రూరల్ ఎస్‌హెచ్‌ఓను సీఐ స్థాయికి పెంచే విధంగా ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా రేషన్ బియ్యం, ఇసుక, గంజాయి, సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల పరిధిలో 24 బార్డర్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఆంధ్రా నుంచి దళారులు కొంత మంది ఫామ్-10 ద్వారా మార్కెట్ సెస్ చెల్లించి ధాన్యాన్ని అక్రమంగా తెలంగాణ ప్రాంతానికి తీసుకొచ్చి ఐకేపీలో విక్రయించి రూ.500 బోనస్ కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. వీటిని అరికట్టేందుకు 24 చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక టీమ్ పని చేస్తుందన్నారు. అంతకు ముందు ఐజీ సత్యనారాయణకు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు గౌరవ వందనం చేశారు. సమావేశంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐలు వీరబాబు, కరుణాకర్, ఎస్‌ఐలు లోకేశ్, కృష్ణయ్య, హరికృష్ణ, శేఖర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### వాడపల్లి చెక్‌పోస్టు పరిశీలన

దామరచర్ల : మండలంలోని వాడపల్లి సరిహద్దు చెక్‌పోస్టును ఐజీ వీ సత్యనారాయణ పరిశీలించారు. చెక్‌పోస్టు వద్ద రికార్డులను తనిఖీ చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ధాన్యం లారీలను ఎట్టి పరిస్థితుల్లో నూ అనుమతించొద్దని ఆదేశించారు. 24 గంటలు పకడ్బందీగా విధులు నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట ఎస్పీ, డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐ వీరబాబు ఉన్నారు.

## 23న పోలీస్ పాత వాహనాల పరికరాల వేలం

సూర్యాపేట టౌన్, డిసెంబర్ 21: జిల్లా పోలీస్ విభాగానికి చెందిన వాహనాల పాత విడి పరికరాల (బ్యాటరీలు, టైర్లు) విక్రయానికి ఈ నెల 23న ఇందిరమ్మ కాలనీలోని పోలీస్ కార్యాలయం ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనాలనుకునే వారు ఉదయం 9 గంటల వరకు హాజరు కావాలని తెలిపారు. ఇతర వివరాలకు జిల్లా పోలీసు మోటార్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి ఆర్‌ఎస్‌ఐ సురేశ్‌ను 87126 86019 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.




జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభిస్తున్న డీఈఓ అశోక్, డీఎస్పీ రవి

## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

- అడిషనల్ కలెక్టర్ రాంబాబు
- ఉమ్మడి జిల్లా జోనల్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

సూర్యాపేట అర్బన్ డిసెంబర్ 21 : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని అడిషనల్ కలెక్టర్ రాంబాబు అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాల గ్రౌండ్‌లో శనివారం ఉమ్మడి జిల్లా జోనల్ స్పోర్ట్స్ మీట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందన్నారు. మానసిక, శారీరక దృఢత్వానికి క్రీడలు దోహద పడుతున్నాయని పేర్కొన్నారు. అంతకు ముందు డీఈఓ అశోక్, డీఎస్పీ రవితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శ్రీధర్ రావు, శ్రీవిద్య, డీజీఎం సుధాకర్, జయరాం, వెంకటేశ్వర్లు, నాగేందర్, సుజాత, నాగేశ్వరావు పాల్గొన్నారు.



నల్లగొండ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

## పుస్తకాలు చదువుతూ సమగ్రశిక్ష ఉద్యోగుల నిరసన

రామగిరి, డిసెంబర్ 21: సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెలో భాగంగా కలెక్టరేట్ వద్ద చేస్తున్న దీక్ష శనివారం 11వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఉద్యోగులు దీక్ష శిబిరంతోపాటు రోడ్డుపై కూర్చుని పుస్తకాలు చదువుతూ, క్రాఫ్ట్, ఆర్ట్స్ ఉపాధ్యాయుల కళాఖండాలు ప్రదర్శిస్తూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు వారికి సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం నేతలతోపాటు జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన ఉద్యోగులు పాల్గొన్నారు.

# పరిశోధనలపై పట్టు సాధించేలా!

- ఎంజీయూలో పది రోజుల పాటు రీసెర్చ్ మెథాడాలజీ శిక్షణ
- వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన అధ్యాపకులు, పరిశోధన విద్యార్థులు

రామగిరి, డిసెంబర్ 21 : నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిశోధన అంశాల్లో ముందుకు సాగుతున్నది. ఐసీఎస్ఎస్ఆర్ సౌజన్యంతోఈ నెల 12న ప్రారంభించిన రీసెర్చ్ మెథాడాలజీ కోర్సు శిక్షణ శనివారం ముగిసింది. ఎంజీయూ ఏర్పాటు తర్వాత రెసిడెన్షియల్ విధానంలో తొలిసారి నిర్వహించిన శిక్షణకు దేశంలో వివిధ రాష్ట్రాల యూనివర్సిటీల నుంచి 38 మంది అధ్యాపకులు, పరిశోధన విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 32 సెషన్లలో నిపుణులైన అధ్యాపకులు 17 మంది ప్రొఫెసర్లు సెంట్రల్ యూనివర్సిటీ, ఎన్ఐటీ, ఐపీఈఎస్ వంటి పేరుగాంచి సంస్థల నుంచి హాజరై శిక్షణ ఇచ్చారు. ప్రధానంగా పరిశోధనల్లో గుణాత్మక విధానం, రీసెర్చ్ ప్రపోజల్స్ తయారీ, అకడమిక్ రైటింగ్, పరిశోధన పత్రాల ప్రచురణ, ఆధునాతన సాంకేతిక పద్ధతులు, కేర్ జర్నల్స్‌లో ఆర్టికల్ రాసే విధానం, రీసెర్చ్‌కు అవసరమైన 70పైగా టూల్స్(సూత్రాలు) తదితర అంశాలను వివరించారు. ముగింపులో వీసీ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ మాట్లాడుతూ ఎంజీయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి శిక్షణను నిర్వహించడం శుభపరిణామం అన్నారు. శిక్షణ కోర్సు డైరెక్టర్‌గా ఎంజీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అల్వాల రవి, కో డైరెక్టర్‌గా అసిస్టెంట్ ప్రొఫెసర్ మిర్యాల రమేశ్ వ్యహరించారు.



ఎంజీయూ రీసెర్చ్ మెథడాలజీ శిక్షణ ముగింపులో మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ అల్తాఫ్ హుస్సేన్, పక్కన రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అల్వాల రవి

### ఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్నాను



నేను గతంలో పలు యూనివర్సిటీలో ఇచ్చిన శిక్షణకు హాజరయ్యాను. కానీ ఎంజీయూ నిర్వహించిన రీసెర్చ్ మెథాడాలజీ శిక్షణలో పరిశోధనకు అవసరమైన ఎన్నో కొత్త విషయాలు తెలుసుకున్నాను. అత్యంత నిపుణులైన ప్రొఫెసర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో అర్థమయ్యేలా అనేక విషయాలు వివరించారు. పీహెచ్‌డీ చేస్తున్న నేను నా గైడ్ చెప్పని ఎన్నో అంశాలను శిక్షణలో నేర్చుకున్నాను.

*- అజిత్ నాయక్, అసిస్టెంట్ ప్రొఫెసర్, మణిపాల్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్*


### రీసెర్చ్‌లోని విభిన్న అంశాలను తెలుసుకున్నాను



నే న్యాయశాస్త్రం పీహెచ్‌డీ స్కాలర్‌ను. ఎంజీయూలో ఇచ్చిన శిక్షణలో దేశంలోనే నిపుణులైన అధ్యాపకుల ద్వారా రీసెర్చ్‌లోని టూల్స్, జర్నల్స్ రాసే విధానం, రీసర్చ్‌కు ఉపయోగపడే వెబ్‌సైట్ల నుంచి అంశాల సేకరణ తెలుసుకున్నారు. న్యూ ఢిల్లీకి చెందిన సెంట్రర్ యూనివర్సిటీకి చెందిన రోహన్‌బల్ల సార్ చెప్పిన విషయాలు ఎంతో స్ఫూర్తినిచ్చాయి.

*- చింతపల్లి సునీల్, లా పరిశోధన విద్యార్థి, తెలంగాణ యూనివర్సిటీ*

### ఆర్-టూల్ గురించి ఇక్కడే తెలుసుకున్నాను



పరిశోధన గ్రంథం రాసే విధానం, రీసెర్చ్‌కు ఉపయోగపడే వెబ్‌సైట్లు, క్వాలిటీ, క్వాంటిటీ రీసెర్చ్ మెథడ్స్ గురించి తెలుసుకున్నాను. ఎంజీయూ ప్రొఫెసర్ మిర్యాల రమేశ్ చెప్పిన ఆర్-టూల్ ఇంత వరకు ఎక్కడా వినలేదు. రీసెర్చ్‌లో ఇది ఎంతో ఉపయోగపడుతుంది. ఇలాంటివి 75 రకాల టూల్స్ శిక్షణలో చెప్పారు.

*- దీపక్, పరిశోధన విద్యార్థి, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కేరళ*



## 30, 31తేదీల్లో జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్

రామగిరి, డిసెంబర్ 21: జిల్లా స్థాయి సైన్స్ ప్రదర్శన, ఇన్‌స్పైర్ మానక్ అవార్డుల ప్రదర్శన ఈ నెల 30, 31 తేదీల్లో నిర్వహించనున్నట్లు డీఈఓ బి.భిక్షపతి తెలిపారు. నల్లగొండలోని డాన్‌బాస్కో హైస్కూల్‌లో జరిగే ప్రదర్శనకు జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల నుంచి ప్రాజెక్టులను తీసుకురావాలని కోరారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతిని 98485 78845 నెంబర్‌లో సంప్రదించాలని శనివారం ఓ ప్రకటనలో సూచించారు.

## జలాల్‌పూర్ చెరువులోకి దూసుకెళ్లిన కారు

- స్వల్పగాయాలతో బయటపడ్డ ఇద్దరు వ్యక్తులు

భూదాన్‌పోచంపల్లి, డిసెంబర్ 21 : మితిమీరిన వేగం వస్తున్న కారు అదుపు తప్పి చెరువులోకి దూసుకెళ్లిన ఘటన భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్పూర్ గ్రామ శివారులో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని హైదర్‌పూర్ గ్రామానికి చెందిన గూడూరు చంద్రారెడ్డి హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో, సగ్గు ఎల్లారెడ్డి ఎల్‌బీ నగర్‌లో నివసిస్తున్నారు. శనివారం వారిద్దరు పోచంపల్లికి బ్యాంకు పని మీద బయల్దేరారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో మితిమీరిన వేగంతో వస్తుండగా, జలాల్‌పూర్ చెరువు కట్ట మూలమలుపు వద్ద అదుపు తప్పి హెచ్చరిక బోర్డును ఢీ కొడుతూ కారు చెరువులోకి దూసుకెళ్లింది. చంద్రారెడ్డి, ఎల్లారెడ్డి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఆర్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి, ఎస్ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని చికిత్స కోసం వారిని భువనగిరి పంపించారు.



చెరువులోకి దూసుకెళ్లిన కారు

### చెరువు కట్ట వద్ద గ్రామస్తుల ధర్నా

జలాల్‌పూర్ చెరువు కటపై ప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు మధ్యాహ్నం చెరువు కట్టపై ధర్నాకు దిగారు. ఈ నెల ఏడున కారు చెరువులోకి దూసుకెళ్లి ఐదుగురు యువకులు ప్రాణాలు కోల్పోయినా స్థానిక ఎమ్మెల్యే అనిల్‌కుమార్ రెడ్డి రక్షణ చర్యలు విషయం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఆందోళనలో బహుజన ప్రజాశక్తి రాష్ట్ర కన్వీనర్ నల్ల లక్ష్మణ్, నాయకులు ఆగయ్య, వెంకటేశం, కృష్ణారెడ్డి, జంగయ్య, బాలరాజు, మక్బూల్, ప్రదీప్‌రెడ్డి, భరత్ భూషన్, దర్శన్, బాలరాజు, మహేందర్‌రెడ్డి, నరసింహ, భిక్షపతి, శంకర్, వెంకటేశ్ పాల్గొన్నారు. కాగా, ఆందోళనతో స్పందించిన ఎమ్మెల్యే కుంభం చెరువు వద్ద రోడ్డు భద్రత చర్యలకు రూ.20 లక్షలు మంజూరు చేయించినట్లు మీడియాకు తెలిపారు. రోడ్డు మార్కింగ్, సైన్ బోర్డులు, మెటల్‌తో రక్షణ కవచం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.